క్లుప్తంగా

వినియోగదారుల వివాదాలపై అవగాహన



విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న రహిమున్నీసా

ఆరిలోవ: వినియోగదారుల వివాదాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలని విశాఖ వినియోగదారుల డిస్ప్యూట్స్ సభ్యురాలు రహిమున్నీసా బేగం తెలిపారు. విశాఖ వేలీ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు వినియోగదారుల వివాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు ఏవిధమైన సమస్యలు ఎదురవుతాయి, వాటిని ఏవిధంగా పరిష్కరించేసుకోవాలి, దీనికి సంబంధించిన ఎలాంటి వివాదాలు ఏర్పడతాయి తదితరవాటి గురించి అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

సమాజ సేవకు సంస్థలు ముందుకు రావాలి



అభివృద్ధి పనులు ప్రారంభించిన కేసలి అప్పారావు

ఆరిలోవ: సమాజ సేవకు సంస్థలు ప్రతినిధులు ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. ప్రభుత్వ బాలికల వసతి గృహంలో రామ్‌కీ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో బాలికల కోసం మరుగుదొడ్‌ల్ నిర్మించింది. వీటికి సబంధించిన శిలాఫలకాన్ని శనివారం ఆయన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గొండు సీతారాంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ కొన్నేళ్లుగా బాలికలు ఎదుర్కొంటున్న మరుగుదొడ్ల సమస్యను రామ్‌కీ ఫౌండేషన్ యాజమాన్యానికి తెలియజేశామన్నారు. దీనికి స్పందించిన యాజమాన్యం ఇక్కడ బాలికల కోసం మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామ్‌కీ ఫౌండేషన్ అధికారి కె.శ్రీకాంత్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్ రాధ, జిల్లా బాలల సంరక్షణాధికారి శ్రీలక్ష్మి, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల హెచ్‌ఎంలకు వ్యాధులపై అవగాహన



హెచ్‌ఎంలకు ఫిజియోథెరపీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్

ఆరిలోవ: చినగదిలి మండలం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం పిజియోథెరపీ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరిలోవ ప్రాంతం డ్రైవర్స్‌కాలనీలో సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన నిజాం హెల్త్ ఇన్‌స్టిట్యూట్ ఫిజియోథెరపీ వైద్యుడు రమేష్ విద్యార్థులకు తరుచూ ఎదురయ్యే రుగ్మతుల గురించి అవగాహన కల్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి వ్యాధికి ఏ విధంగా ఫిజియోథెరపీ చేయాలో తెలియజేశారు. అనంతరం సాగర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ భరత్ సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, డయేరియా, తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. వాటి నివారణకు ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలో తెలియజేశారు, పాఠశాలల్లో విద్యార్థులకు వీటిపై తెలియజేయాల్సిన అంశాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్.రవీంద్రబాబు, పి.అనురాధ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలతో జాగ్రత్త



తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారులు



టీకాల కోసం తీసుకువచ్చిన పోలీస్ జాగిలాలు



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న కేజీహెచ్ ఆర్ఎంవో భాస్కరరావు

ఆరిలోవ: రేబిస్ వ్యాధి రాకుండా ప్రజలు జాగ్రత్త పడాలని కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ దవల భాస్కరరావు తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా చినగదిలి మండలం తోటగరువు పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ దవల భాస్కరరావు మాట్లాడుతూ జంతువులను ప్రేమించే క్రమంలో మనం జాగ్రతలు తీసుకోవడం మరిచిపోకూడదన్నారు. కుక్కలను పెంచినవారు వాటికి తగిన సంరక్షణ చేయాలన్నారు. వాటికి సంరక్షణ చేస్తూ మనం జాగ్రత్తలు పాటించాలన్నారు. పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి రాకండా టీకాలు వేయించాలన్నారు. అనంతరం పశు సంవర్ధక శాఖ డీడీలు డాక్టర్ మేపాడ చంద్రశేఖర్ రావు, డాక్టర్ ఎస్.కరుణాకరరావు, డీఎస్‌వో డాక్టర్ జగదీష్ చంద్ర మాట్లాడుతూ పెంపుడు కుక్కల యజమానులకు జూనోసిస్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేసి వాటికి అవసరమైన ఆహారం పంపిణీ చేశారు. ఇక్కడ వైద్య శాలకు విశాలాక్షినగర్ ఆర్మ్‌డ్ పోలీసులు శిక్షణ ఇచ్చే జాగిలాలను కూడా తీసుకువచ్చారు. వాటికి కూడా పశు వైద్యులు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ బి.రామ్మోహనరావు, ఆంధ్రాలజీ ఉప సంచాలకుడు డాక్టర్ దేవులపల్లి శంకరరావు, ఏడీలు డాక్టర్ శ్రీనివాసరావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పశు వైద్యాధికారులు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూనోసిస్ వ్యాధులు వేటి వల్ల వస్తాయి, ఎవరికి వ్యాపిస్తాయి తదితర వాటి గురించి పశు వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ డి.శంకరరావు, డాక్టర్ బి.రామ్మోహనరావు విద్యార్థులకు వివరించారు. కుక్కలు నుంచి ఇతర జంతువులకు, మనుషులకు రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసిల్లస్ తదితర జూనోసిస్ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. కుక్కలను పెంచినవారు చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూనోసిస్ వ్యాధుల గురించి తెలుసుకొన్న విద్యార్థులు స్థానికులకు వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : పెంపుడు శునకాలకు క్రమం తప్పకుండా ప్రతి ఏడాది యాంటీ రేబిస్ వ్యాక్సిన్ చేయించాలని ఇసుకతోట పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి పూర్ణిమ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పశువైద్య కేంద్రం వద్ద రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవో ఇ.శశికళ తదితరులు పాల్గొన్నారు.



ఇసుకతోటలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ పూర్ణిమ

ఆదర్శనీయుడు జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ తదితరులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఏయూలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రిజిస్ట్రార్ కిషోర్ బాబు మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ దేశంకోసం చేసిన సేవలను కొనియాడారు. ఎన్నో కష్టాలను ఓర్చుకుని జగ్జీవన్‌రామ్ ఎదిగిన విధానం, కార్యదక్షత, నాయకత్వం నేటి యువతకు ఎంతో ఆదర్శనీయమన్నారు. ఆయన జీవితం నుంచి స్ఫూర్తిని పొందుతూ ఉన్నత స్థాయికి యువత ఎదిగే దిశగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, జి.గిరిజా శంకర్, పద్మశ్రీ, డీన్‌లు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో జగ్జీవన్‌రామ్ చైర్ ఏర్పాటు చేయండి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న పరిశోధకులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చైర్‌ను ఏర్పాటు చేయాలని వర్సిటీ పరిశోధకులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సభ్యులు కోరారు. శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా న్యూఢిల్లీలోని సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ నేషనల్ ఫౌండేషన్‌కు సైతం లేఖ రాశారు. దేశానికి ఉప ముఖ్యమంత్రిగా, విభిన్న మంత్రి పదవులను అలంకరించిన జగ్జీవన్‌రామ్ పేరుమీదుగా ఏయూలో చైర్ ఏర్పాటు చేయాలని ఈ లేఖలో కోరారు. 1973లో ఏయూ గౌరవ డాక్టరేట్‌ను సైతం అందించిందన్నారు. జగ్జీవన్‌రామ్ ఆలోచన విధానాలను లోతుగా అధ్యయనం చేయడానికి ఈ కేంద్రం పనిచేస్తుందని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్వీపీలో ఇన్ఫో మయోపియా సెంటర్



ఎల్వీపీలో కొత్త సెంటర్ ప్రారంభిస్తున్న వైద్యులు

ఆరిలోవ: ఇన్ఫో ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో జాతీయరహదారి పక్కన హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శనివారం కొత్తగా ఇన్ఫో మయోపియా సెంటర్ అందుబాటులోకి వచ్చింది. దీనిని గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ రాజా పి.పుష్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్ఫో సెంటర్ నెట్‌వర్క్ హెడ్ డాక్టర్ పవన్ వర్కిచర్ల మాట్లాడుతూ ఎల్వీపీలో ప్రారంభించిన ఇన్ఫో మయోపియా సెంటర్ దీర్ఘ కాలం పాటు సేవలు అందించనుందన్నారు. దీనివల్ల మంచి ప్రయోజనం చేకూరుతుందన్నారు. పిల్లలకు, యువకులకు అత్యాధునిక సాంకేతికతతో కంటి వైద్య సేవలు అందించడానికి ఇది వీలుపడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆనందాన్ని పంచిన సురభి నాటకాలు



సురభి కళాకారులతో బాదంగీర్ సాయి

ఏయూక్యాంపస్: నగరంలో వారం రోజులుగా జరిగిన సురభి నాటక ప్రదర్శనలు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయని భానోదయ నాట్య మండలి అధినేత నాగ బాబు అన్నారు. శనివారం ఏయూ రంజనీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ వేడుకల్లో పాల్గొని మీడియాతో మాట్లాడారు. రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో కళాభారతి వేదికగా ప్రదర్శించిన ప్రతీ నాటకాన్ని తిలకించడానికి విచ్చేసిన విశాఖవాసులకు, వారి ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖలో ఉచిత ప్రదర్శన ఇవ్వాలని తమ కుటుంబం అంతా నిర్ణయించుకున్నామని, దీనికి ప్రజల నుంచి సైతం మంచి స్పందన లభించిందన్నారు. గతంలో ఇటువంటి ప్రక్రియన మన దేశంలో ఉండేదని, నేడు దీనిని పునరుద్ధరించడం జరిగిందన్నారు. ప్రజలే పోషకులుగా, నగర వాసులు ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశామని, ఎంతో సంతృప్తితో ఇక్కడ నుంచి బయలుదేరుతున్నామన్నారు. రంగ సాయి నాటక సంఘం నిర్వాహకులు బాదంగీర్ సాయి మాట్లాడుతూ ఇది విశాఖ ప్రజల విజయమన్నారు. కార్యక్రమంలో భాను ప్రసాద్, ఎస్.నాగేశ్వర రావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వి.నాంచారయ్య, శివజ్యోతి, గంజాం చిత్ర దర్శకుడు సురేష్, సంధ్యా ప్రియ దర్శిని, అనూష, ఇమంది ఈశ్వర రావు తదిరతులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీవీఎల్ తదితరులు

ఎంవీపీకాలనీ: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని లాసెన్స్‌బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు జీవీఎల్ నరసింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయవాదిగా పేరొందిన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 1901లో కలకత్తాలోని అతి పేద కుటుంబంలో జన్మించారన్నారు. ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించారన్నారు. ఆయన స్ఫూర్తితో దేశ యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం ఒక చెట్టు–అమ్మ కోసం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య కె.రమేష్ బాబు తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లో శిబిరాన్ని నిర్వహిస్తారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు, ఔషధాలను సూచిస్తారు. ఇతర వివరాలకు డాక్టర్ కె.ఈశ్వర రావును 9440191673 నంబరులో సంప్రదించవచ్చును.

బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చదువులు చెప్పాలని విద్యాశాఖ ఆర్జేడీ బి. విజయ భాస్కర్ అన్నారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లాలోని గణితం బోధించే ఉపాధ్యాయులకు శనివారం వృత్తి నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జేడీ విజయ భాస్కర్ మాట్లాడుతూ గణతం అంటే విద్యార్థుల్లో లేనిపోని భయం ఉందని, ఇదో కష్టమైన సబ్జెక్టుగా భావిస్తున్నారన్నారు. కానీ సబ్జెక్టులో పట్టుసాధిస్తే,గణితమే సులభమన్నారు. దీనిలోనే ఎక్కువ మార్కులు కూడా సాధించవచ్చన్నారు. సబ్జెక్టుపై పట్టుసాధించి బోధనలో మెలకువలను తెలుసుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు.

డీఈవో ఎల్. చంద్రకళ మాట్లాడుతూ సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులను ముందుగా గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రతీ ఉపాధ్యాయుడు శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ గణిత పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల తరపున ఆయా పాఠశాలల గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం వై. వేణుగోపాల్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

తల్లి పేరుతో మొక్కను నాటండి



మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బంది

ఏయూక్యాంపస్: ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన ఏక్ పేడ్ మాతాకే నామ్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం ఏయూలో జాతీయ సేవా పథకం అధికారులు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతూ జాతీయ సేవ పథకం ప్రతి యూనిట్ ఆధ్వర్యంలో చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. మొక్కల వలన ప్రాణవాయువు లభిస్తుందని, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ప్రతీ వ్యక్తి తల్లిరుణం తీర్చుకోవాలని భావిస్తారని, అలా భావించే వారంతా తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. తల్లి మనకు ప్రాణం ఇస్తుందని, దీనిని రక్షిస్తూ మనకు నిత్యం ప్రాణవాయువును మొక్కలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవ పథకం ప్రోగ్రాం అధికారిణి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమామహేశ్వర రావు, డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ అర్చన, వై.అనసూయా దేవి, జాతీయ సేవా పథక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలల్లో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు మొక్కలు నాటి ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘనంగా మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి



విజేతకు జ్ఞాపిక అందిస్తున్న విశాఖ మ్యూజిక్ అకాడమి ప్రతినిధులు

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళంపల్లి రచించి ఆలపించిన కీర్తలపై నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కార్యక్రమంలో ప్రముఖ గాత్ర విద్వాంసురాలు పోరూరి గౌరీనాథ్ కచేరి అందర్నీ అలరించింది. ఈకార్యక్రమంలో వీఎంఏ ప్రతినిధులు రంగరాజన్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

విజేతలు విజయనగరం, హనీ గ్రూప్

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా క్రికెట్ సంఘం వార్షిక డివిజన్ లీగ్ పోటీల్లో విజయనగరం, గెలాక్సీ జట్లతోపాటు డివిజన్ల, ఇన్‌స్టిట్యూషన్ లీగ్ విజేతలు ట్రోఫీలందుకున్నారు. శనివారం నిర్వహించిన వార్షిక బహుమతి ప్రధానోత్సవంలో తొలి డివిజన్ విజేతగా విజయనగరం జిల్లా జట్టు నిలవగా, రన్నరప్‌గా గెలాక్సీ సీసీ నిలిచింది. రెండో డివిజన్‌లో ఈకోర్నా, కౌంటీ సీసీ జట్లు, మూడో డివిజన్‌లో స్టీల్‌ప్లాంట్, సోలోస్ జట్లు, నాలుగో డివిజన్‌లో ఉషోదయ సీసీ, మూన్ స్టార్స్ జట్లు, ఐదో డివిజన్‌లో రైజింగ్ బ్లూస్, యూసీసీ జట్లు, ఆరో డివిజన్‌లో వాల్తేర్ నైట్స్, లెజండ్స్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఇన్‌స్టిట్యూషన్ లీగ్‌లో హనీ గ్రూప్, సిటీ పోలీస్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. స్థాయి ఆధారంగా ఆరు డివిజన్లుగా పోటీలు నిర్వహించగా తొలి డివిజన్‌లో తపస్వి బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా, మనీష్ బెస్ట్ బౌలర్‌గా, ఎస్వీ రాహుల్ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచారు. ఈశ్వర్, చరణ్, సుమీత్ రెండో డివిజన్‌లో, యశస్వి, శ్రీనివాస్, సతీష్ మూడో డివిజన్‌లో, రాజు, నాగార్జున, అనిల్‌కుమార్ నాలుగో డివిజన్‌లో బెస్ట్‌గా నిలిచారు. సతీష్, హరీష్, హేమంత్ ఇన్‌స్టిట్యూషనల్ లీగ్‌లో బెస్ట్‌గా నిలిచారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీడీసీఏ ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ, కార్యదర్శి పార్థసారథి బహుమతి ప్రధానం చేయగా సంఘం ప్రతినిధులు సుధాకర్, టీఎస్ఆర్ ప్రసాద్, ఎస్ఎస్ ప్రసాద్, జేకేఎం రాజు, సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పక ధరించండి

మహారాణిపేట : మోటారు వాహనాల చట్టం, హెల్మెట్ వినియోగంపై ఆంధ్రా మెడికల్ కళాశాల విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ, జిల్లా న్యాయ సేవల అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి ఆలపాటి గిరిధర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.